www.aknu.edu.in

nannayavani@aknu.edu.in

nannayanewstv

Adikavi Nannaya University

9701293231

విశ్వవిద్యాలయ స్థాయి తొలి తెలుగు వార పత్రిక

# నన్నయ వాణి

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్

గౌరవ సంపాదకులు

ఆచార్య మొక్కా జగన్నాథరావు

ఉపకులపతి

ప్రధాన సంపాదకులు

ఆచార్య తుపాకుల అశోక్

కుల సచివులు

సంపాదకులు

డా.తలారి వాసు, సహాయాచార్య, తెలుగు శాఖ

పువ్వల ఆనంద్, ప్రజా సంబంధాల అధికారి, కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 2 | సంచిక : 9 | 06-12-2021 | పుటలు : 4





## అక్షర శిల్పి

అక్షరాలు - చైతన్య కిరణాలు
అక్షరాలు - స్ఫూర్తి తరంగాలు
అక్షరాలు - హిత వచనాలు

తన కలంలోని సిరాను వెన్నెలగా సిరివెన్నెల రూపంలో అందించిన కవి సీతారామ శాస్త్రి గారు. కలం పట్టి కాగితంతో ఆయన చేసిన దోస్తీని పాటల రూపంలో సినీ ప్రపంచం మనకు అందించింది. హృదయానికి హాయిగొల్పేలా, అన్యాయాన్ని ఎదిరించే అగ్నిలా, ప్రేమకు చిరునామాగా, సరదా పాటల హంగామాగా, అభ్యుదయ గీతాలుగా వారందించిన రచనలు మన మనసుల్లో శాశ్వతంగా నిలిచే ఉంటాయి. కవిత్వాన్ని శ్వాసించిన సిరివెన్నెల పాటలవెన్నెలగా మన గుండెల్లో మిగిలిపోతారు. నన్నయ విశ్వవిద్యాలయం నిర్వహించిన రెండు జాతీయ సదస్సుల్లో తమ ఉపన్యాసాల ద్వారా మా మనసుల్లో నిలిచిపోయారు. తెలుగు సినిమా పాటకు రాజసమైన మార్గాన్ని చూపించి వెళ్లిన శాస్త్రి గారి ఆత్మకు సద్గతి శాంతి కలగాలని ఆశిస్తూ వారికి ఘన నివాళిని అర్పిస్తున్నాను.

- ఆచార్య మొక్కా జగన్నాథరావు,
ఉపకులపతి

## భారతదేశ ప్రథమ రాష్ట్రపతి



బాబు రాజేంద్రప్రసాద్ జయంతి

డిసెంబర్ 3

భక్తి నీరాజనం

- నన్నయవాణి

# నన్నయ మేనేజ్మెంట్ ఫెస్ట్‌కు విశేష స్పందన





సమావేశంలో మాట్లాడుతున్న వీసీ జగన్నాథరావు







**04.12.21 (మీడియాసెల్)** ప్రభుత్వోద్యోగాల కోసమే ఎదురు చూడకుండా నైపుణ్యాలను పెంపొందించుకొని పారిశ్రామికవేత్తలుగా ఎదిగి దేశాభివృద్ధిలో కీలకపాత్ర పోషించాలని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. యూనివర్సిటీ కన్వెన్షన్ సెంటర్ లో శుక్రవారం డిపార్ట్మెంట్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్మెంట్ స్టడీస్ ఆధ్వర్యంలో "సావిష్కార్2కె21" మేనేజ్మెంట్ ఫెస్ట్ ను ఘనంగా నిర్వహించారు. ఉభయగోదావరి జిల్లాల్లోని ఆదికవి నన్నయ యూనివర్సిటీ అనుబంధ కళాశాలల నుండి సుమారు 11 వందల మంది విద్యార్థులు ఈ ఫెస్ట్ కు హాజరయ్యారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు జ్యోతిప్రజ్వల చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులనుద్దేశించి వీసీ మాట్లాడుతూ నేటి ఆధునిక కాలంలో సంస్థల అభివృద్ధిలో మేనేజ్మెంట్ విద్యార్థుల పాత్ర ఎంతో కీలకంగా ఉంటుందని అన్నారు. కామర్స్ అండ్ మేనేజ్మెంట్ విద్యార్థులకు ఎన్నో అవకాశాలు ఉన్నాయని వాటిని అందిపుచ్చుకొనే విధంగా ప్రయత్నాలుచేయాలన్నారు. కమ్యూనికేషన్ స్కిల్స్ ను అభివృద్ధి చేసుకొని ఉన్నత ఉపాధి, ఉద్యోగాలలో స్థిరపడాలని తెలిపారు.ప్రభుత్వోద్యోగాల కోసం ఎదురు చూడకుండా నైపుణ్యాలను పెంచుకొని స్వయంశక్తిపై పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని చెప్పారు. ప్రభుత్వం యుతకు ఎంతో ప్రోత్సాహాన్ని ఇస్తుందని, నూతన పరిశ్రమ ఏర్పాటుకు సహకారాలను అందిస్తుందని తెలియజేసారు.ఉద్యోగాలలో చేరిన విద్యార్థుల ఆయా సంస్థల లక్ష్యాలకు అనుగుణంగా పని చేయాలని సంస్థల అభివృద్దే ధ్యేయంగా ముందుకు సాగాలన్నారు.సంస్థలలో హెచ్.ఆర్ లు, మేనేజర్లుగా కీలక పదవులలో సేవలందిస్తూ సంస్థ భవిష్యత్ కు బంగారు బాటలు వేయాలన్నారు. లక్ష్య సాధనలో, ఒత్తిళ్ళలో కూడా విలువలను కాపాడుకుంటూ జీవించాలన్నారు.గెయిల్ ఆపరేషన్స్ అండ్ మేనేజ్మెంట్ జనరల్ మేనేజర్ బి.ఎన్.రావు మాట్లాడుతూ ఆదికవి నన్నయ యూనివర్సిటీలో నిర్వహిస్తున్న ఫెస్ట్ కు విశేష ఆదరణ వచ్చిందని ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థులలో సృజనాత్మకతను వెలికితీస్తాయని శుభాకాంక్షలు తెలియజేసారు. తరువాత డిపార్టమెంట్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్మెంట్ విద్యార్థుల ఆధ్వర్యంలో బిజినెస్ గేమ్స్, కామర్స్ అండ్ టూరిజం గేమ్స్, మిని గేమ్స్ అండ్ కల్చరల్స్, మైంట్ గేమ్స్ లలో విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను కనపరిచారు. ఫెస్ట్ కు హాజరైన ఆయా కళాశాలల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థులను ఉర్రూతలూగించాయి. ఈ కార్యక్రమంలో గెయిల్ సీనియర్ మేనేజర్ బి.బాలాజి, ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.టేకి, విభాగాధిపతి డా.పి.ఉమామహేశ్వరి,డీన్ డా.ఎన్.ఉదయభాస్కర్ అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

















ఆల్ రౌండర్ చాంపియన్షిప్ మొదటి స్థానం కాకినాడ క్యాంపస్, రెండోస్థానం తాడేపల్లిగూడెం క్యాంపస్ లు కైవసం చేసుకున్నాయి.







## సంపాదకీయం



# సిరివెన్నెల

'పాట మనిషి మనస్సును శుద్ధి చేస్తుంది' అంటారు తల్లీ భూదేవి నవలలో చెంగీజ్ ఐతోమాతోవ్. వెన్నెలసోనలాంటి పదాలతో అక్షర కాంతులద్దిన మాటలతో రాసిన పాటలు మనసులను హాయి గొల్పుతాయి. పాటలవెన్నెలను మన మీద ప్రసరింపచేసిన సినీకవి సిరివెన్నెల సీతారామశాస్త్రి. కొన్ని పాటలతో సమాజాన్ని నిగ్గదీసిన యోచనా ఋషి ఆయన. మూడున్నర దశాబ్దాలపాటు తన కలంతో సామాజిక రుగ్మతల్ని చెండాడిన కలంయోధుడు!

ఈగాలీ.. ఈనేల.. సెలయేరు! ననుగన్న నాఊరు!! ఇది ఆయన పాట. విశాఖ జిల్లా అనకాపల్లి సొంతూరు. 'జగమంత కుటుంబం నాది...ఏకాకి జీవితం నాది' అని చక్రం సినిమా కోసం ఆయన రాసిన పాట వినని తెలుగువారుండరు. ఆర్షతాత్విక చింతనా పరామర్శతో గీత ప్రక్రియ ద్వారా సాహిత్య సృష్టి చేస్తూ సాహితీ విహాయస విహారం చేసిన కర్మిష్టి ఆయన. కృష్ణశాస్త్రి,ఆత్రేయ, మల్లాది,వేటూరి....వీరి బాణీని పునికి పుచ్చుకుని నుడిసిరివెన్నెలగా, మంచి సినిమాపాటకు చిరునామాగా సినిమాస్థాయిని సాహిత్యస్థాయికి తీసుకొచ్చిన ఘనత ఆయనకే దక్కుతుంది. వేయిచిత్రాలకు మూడువేల గీతాలకు పైబడి రచించి అందించి 12 నంది అవార్డులు,భారత ప్రభుత్వం నుండి పద్మశ్రీ అందుకున్న సినీగీతాల "అందెల రవమది"

విరించినై విరచించితిని ఈ కవనం! విపంచినై వినిపించితిని ఈ గానం!! – అని తన కవనాన్ని,గానాన్ని పంచి.. "పంచే గుణమే లేకపోతే ప్రపంచమే శూన్యం" అంటారు.

"నీ ప్రశ్నలు నీవే – ఎవ్వరూ బదులివ్వరుగా!
నీ చిక్కులు నీవే – ఎవ్వరూ విడిపించరుగా!!" అంటూ ఒక కొత్త బంగారులోకాన్ని మన ముందు సృష్టించారు.

శృతినీవు,గతినీవు ఈ నా కృతి నీవు భారతీ!,
ఆనతినీయరా హరా!!
తెలిమంచు కరిగింది తలుపు తీయనా ప్రభూ! ఇలగొంతు వణికింది పిలుపునీయనా ప్రభూ!! అనే 'స్వాతికిరణం'లోని పాటలు వింటున్నప్పుడు టాగోర్ గీతాంజలి గుర్తుకొస్తుంది.

"తెలవారదేమో స్వామి! తలపుల మునకతో అలసిన దేవేరి అలమేలుమంగకూ..."అని భక్తి గానంతో ఓలలాడించి, "ఆది భిక్షువువాడినేమి కోరేది? బూడిదిచ్చేవాడినేమి అడిగేది?" అని ప్రశ్నించి "అపురూపమైనదమ్మ ఆడజన్మ ఆ జన్మకు పరిపూర్ణత
ఇల్లాలమ్మా!" అని భగవంతుణ్ని అమ్మలో చూపించారు.

మనమంతా నియమిత సమయం కోసం ఈ లోకానికి వచ్చిన అతిథులం!అనవసరమైన తాపత్రయం ఎందుకు? అనే ప్రశ్న రూపంలో సమాజానికి గొప్ప సందేశాన్నిచ్చారు."మరీ అంతగా,మహా చింతగా,మొహం ముడుచుకోకలా"అని ప్రబోధించి సీతమ్మ వాకిట్లో సిరిమల్లెచెట్టు అయ్యారు. ఆయన మాట శివ స్వరూపిణి! ఆయన పాట అనంత జీవనవాహిని!!

'అంత కడివెడు పాలపై ఒక్కింత మీగడ పేరినట్లుగ... మనకు మిగులును గతములోపలి మంచి – అదియె "సంప్రదాయము"!! అన్నారు సి.నారాయణరెడ్డి.
ఆ సంప్రదాయాన్ని తెలుగు సినిమా పాట ద్వారా నిలబెట్టిన కవి శ్రీ సిరివెన్నెల.

"ఘల్లు ఘల్లు ఘల్లుమంటు మెరుపల్లె తుళ్ళిన" ఆయన కలంలోని సిరా... "చుక్కల్లారా! చూపుల్లారా!ఎక్కడమ్మా జాబిలీ!! అంటూ నింగికెగసినా, అస్తమించని అక్షర సూర్యునిగా, తెలుగుపాటగా మన గుండెల్లో నిత్యం వెలుగుతూనే ఉంటారు.

– డా.తలారి వాసు

# నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలి

**29.11.21 (మీడియాసెల్)** ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ సిబ్బంది నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలని, మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతికతను అల వర్చుకోవాలని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ఆధ్వర్యంలో నాన్ టీచింగ్ సిబ్బందికి నైపుణ్యాభివృద్ధిపై శిక్షణ కార్యక్ర మాన్ని ఏర్పాటు చేసారు. సోమవారం విశ్వ విద్యాలయంలో వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారం భించి సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకుంటూ విశ్వవిద్యాలయ సిబ్బంది అప్ డేట్ గా ఉండాలన్నారు. విశ్వవిద్యాలయ సిబ్బంది నైపుణ్యాలను అభివృద్ధి చేసేందుకు ఈ శిక్షణ తరగతులను ఏర్పాటు చేసామన్నారు. సాఫ్ట్ స్కిల్స్, లాంగ్వేజ్ స్కిల్స్,కంప్యూటర్ స్కిల్స్, ఈ–ఆఫీస్ వంటి అంశాలపై నిపుణులైన అధ్యాపకులు శిక్షణ ఇస్తారన్నారు. ఆయా విభాగాల్లోని 30 మంది చొప్పున ఎంపిక చేసి వారం రోజులు శిక్షణ ఇస్తారని అనంతరం పరీక్షలు నిర్వహించి ఉత్తీర్ణులైన వారికి సర్టిఫికెట్లును అందిస్తారన్నారు. సిబ్బంది అంతా నేర్చుకోవాలనే ఆసక్తితో ఈ శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిక్షణ తరగతుల నిర్వహకులు ప్రిన్సిపాల్ డా.వి.పెర్సిస్ మాట్లాడుతూ వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు సూచన మేరకు యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ వారం రోజుల శిక్షణ తరగతులను నిర్వహిస్తుందని చెప్పారు. ఇంజనీరింగ్ కాలేజ్ అధ్యాపకులైన బి.బి.అహమద్ అలీ లాంగ్వేజ్ స్కిల్స్ పై, డి.దాసు కంప్యూటర్ స్కిల్స్ పై, ఎం.శ్రీనివాస్ ఈ–ఆఫీసుపై శిక్షణను అందిస్తారన్నారు. ఈసీ మెంబర్స్ ఆచార్య కె.శ్రీరమేష్, డా.బి.జగన్మోహనరెడ్డి మాట్లాడుతూ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ చరిత్రలో తొలిసారిగా నాన్ టీచింగ్ సిబ్బందికి నైపుణ్యాభివృద్ధిపై శిక్షణ తరగతులు నిర్వహించడం హర్షణీయమని వీసీని అభినందించారు. ఈ శిక్షణ తరగతులను అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ఆధ్వర్యంలో వీసీ ని సన్మానించి అభినందనలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ జగన్నాథరావు

# కళాశాలలు క్రీడలకు ప్రాధాన్యమివ్వాలి

**01.12.21 (మీడియాసెల్)** ఉభయగోదావరి జిల్లాల్లోని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం అనుబంధ కళాశాలలు క్రీడలకు అధిక ప్రాధాన్యమివ్వాలని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. బుధవారం యూనివర్సిటీలో అనుబంధ కళాశాలల ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ తో వార్షిక జనరల్ బాడీ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు హాజరై ఉపన్యసించారు. విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలలు క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. ఫిజికల్ డైరెక్టర్లు విద్యార్థులలోని క్రీడా ప్రతిభను గుర్తించి వారికి తగిన అవకాశాలు కల్పించాలన్నారు. క్రీడల్లో పాల్గొన్న వారికి హాజరు, రాయితీలు, అవసరమైన సౌకర్యాలను ఏర్పాటు చేయాలన్నారు. క్రీడల్లో ప్రతిభ కనపరచిన క్రీడాకారులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. కోవిడ్ ను దృష్టిలో పెట్టుకుని క్రీడాకారులకు హెల్త్ ఇన్సూరెన్స్ లను చేయించాలన్నారు. క్రీడల పరంగా అభివృద్ధి చెందిన కళాశాలలు తమ పరిధిలో ఉన్న మిగిలిన కళాశాలల క్రీడాభివృద్ధికి సహాయ సహకారాలు అందించాలన్నారు. గోదావరి జిల్లాలలో సహజంగా ఉన్న క్రీడా నైపుణ్యాన్యాలపై పీడీలు దృష్టి సారించి తగిన శిక్షణ అందించాలని తెలియజేశారు. క్రీడాభివృద్ధికి అవసరమైన ప్రోత్సాహాన్ని విశ్వవిద్యాలయం నుండి అందిస్తామని సూచించారు. తరువాత స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ డా. బి.రామ్ గోపాల్ వార్షిక నివేదికను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి. అశోక్, స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ డా.బి.రామ్ గోపాల్, ప్రిన్సిపాల్ డా. కె.సుబ్బారావు, ఫైనాన్స్ ఆఫీసర్ సత్యనారాయణ మరియు ఉభయ గోదావరి జిల్లాల ఫిజికల్ డైరెక్టర్లు పాల్గొన్నారు




సమావేశంలో మాట్లాడుతున్న వీసీ

# పర్యావరణాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిది

**02.12.21 (మీడియాసెల్)** కాలుష్యం కోరల్లో నుండి పర్యావరణాన్ని రక్షించు కోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో గురువారం జాతీయ కాలుష్య నివారణ దినోత్సవం సందర్భంగా రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు మాట్లాడుతూ 1984 నాటి భయంకరమైన భోపాల్ గ్యాస్ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి జ్ఞాపకార్థం ప్రతి సంవత్సరం డిసెంబర్ 2న జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామన్నారు. ప్రమాదవశాత్తు విష రసాయన వాయువు మిథైల్ ఐసోసైనేట్ మరియు ఇతర విష వాయువులు విడుదల కావడం వల్ల ఈ దుర్ఘటన జరిగిందన్నారు. పర్యావరణాన్ని కాలుష్యం కోరల్లో నుండి రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కాలుష్య నివారణ అనేది ప్రతి ఇంటి నుండి ప్రారంభం కావాలని సూచించారు. బాల్యం నుండి విద్యార్థులకు పర్యావరణ హితంగా జీవించే అలవాట్లను నేర్పించాలని, తద్వారా భవిష్యత్తులో పర్యావరణం పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరిస్తారని తెలియజేశారు. పర్యావరణ కాలుష్యానికి కారణాలైన పరిశ్రమలు, సంస్థలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. లక్షలాది మందికి జీవనాధారమైన అఖండ గోదావరి నదిని కాలుష్యం నుండి రక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని గుర్తు చేశారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం మరియు గోదావరి పరిరక్షణ సమితి సంయుక్త ఆధ్వర్యంలో త్వరలో కాలుష్యం కోరల్లో నుండి గోదావరిని రక్షించడం, గోదావరి నదిని శుభ్రపరచడంపై కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి. అశోక్ విశ్వవిద్యాలయ అధికారులు అధ్యాపకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ

# సతీష్ చంద్ర సేవలు అభినందనీయం



సతీష్ చంద్రను సన్మానించిన అభినందిస్తున్న వీసీ

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉన్నత విద్యాభివృద్ధికి కృషిచేసిన ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి సతీష్ చంద్ర సేవలు అభినందనీయమని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. ఉన్నత విద్యలో సేవలందించి పదవీవిరమణ చేసిన సతీష్ చంద్రను వీసీ జగన్నాథరావు సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ 35 సంవత్సరాల సుదీర్ఘ అనుభవంతో ప్రభుత్వంలో ఉన్నత పదవులు అధిరోహించి, మంచి పరిపాలనా దక్షుడుగా పేరొందిన సతీష్ చంద్ర రాష్ట్ర ఉన్నత విద్యాభివృద్ధిలో తనదైన ముద్ర వేసుకున్నారని అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం అభివృద్ధిని ప్రోత్సహిస్తూ ప్రభుత్వానికి విశ్వవిద్యాలయానికి మధ్య వారధిగా సేవలు అందించారన్నారు. యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సమావేశాలకు హాజరవుతూ సహకారాలను అందించేవారని తెలిపారు. పదవి విరమణ తర్వాత కూడా ఉన్నత విద్యకు వారి సేవలు ఉపయోగపడాలని ఆకాంక్షించారు. నన్నయ విశ్వవిద్యాలయ అభివృద్ధికి వారి సేవలు అందుబాటులో ఉంటాయని సతీష్ చంద్ర పేర్కొన్నారని అన్నారు. గతంలో తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ గా ఆయన విశేష సేవలందించి ప్రజల ఆదరాభిమానాలు అందుకున్నారని గుర్తుచేశారు. ఉభయగోదావరి జిల్లాల్లోని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం అనుబంధ కళాశాలలు మరియు విశ్వవిద్యాలయ ప్రాంగణాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థుల తరుపున పదవీ విరమణ శుభాకాంక్షలు తెలియజేశారు.



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ నూతన ప్రిన్సిపల్ చీఫ్ సెక్రటరీ శ్యామలరావును మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసిన వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు.

# నాన్ టీచింగ్ సిబ్బంది సంక్షేమమే ధ్యేయం



04.12.21 (మీడియాసెల్) యూనివర్సిటీల అభివృద్ధిలో కీలక పాత్రను పోషించే బోధనేతర సిబ్బంది సంక్షేమమే ధ్యేయమని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథ రావు అన్నారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీలో శనివారం ఆల్ యూనివర్సిటీ నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు హాజరై నన్నయ విగ్రహానికి, వై.ఎస్.రాజశేఖరరెడ్డి, జక్కంపూడి రామ్మోహన రావు చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ యూనివర్సిటీ ప్రగతిలో నాన్ టీచింగ్ సిబ్బంది కీలక పాత్ర పోషిస్తారని అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల నాన్ టీచింగ్ సిబ్బంది నన్నయ యూనివర్సిటీలో సమావేశం కావడం ఆనందంగా ఉందన్నారు. విశ్వవిద్యాలయాలలో పని చేయడం గొప్ప అదృష్టమని పనిని దైవంగా భావించి ముందుకు సాగాలన్నారు. విశ్వవిద్యాలయంలో విలువలు కలిగి జీవించాలని సిబ్బంది సమస్యలను పరిష్కరించేందుకు తాను ముందుంటానని చెప్పారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ నాన్ టీచింగ్ సిబ్బంది సంక్షేమం కొరకు కృషి చేస్తున్నామన్నారు. చక్కని కార్యక్రమాన్ని నిర్వహించిన నన్నయ యూనివర్సిటీ నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జె.గౌతమ్ నాయుడును వీసీ అభినందించారు. రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ మాట్లాడుతూ మానవ శరీరంలో కనిపించని అవయవాల మాదిరిగా నాన్ టీచింగ్ సిబ్బంది యూనివర్సిటీ కోసం పని చేస్తున్నారన్నారు. ఆల్ యూనివర్సిటీ నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ ప్రెసిడెంట్ వై.వెంకటప్పారెడ్డి, సెక్రటరీ జి.రవికుమార్ లు మాట్లాడుతూ ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు చేస్తున్న కృషిని అభినందించారు. విశ్వవిద్యాలయంలో మంచి పరిపాలనను అందిస్తూ సిబ్బంది సంక్షేమం కోసం నిరంతరం ఆలోచించే వీసీ దొరకడం గొప్ప భాగ్యమని కొనియాడారు. రాష్ట్రంలోని యూనివర్సిటీల నాన్ టీచింగ్ సిబ్బందికి చక్కని వేదికను అందించిన నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ఆదికవి నన్నయ యూనివర్సిటీ నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ గౌరవ అధ్యక్షురాలు జక్కంపూడి విజయలక్ష్మి, అసోసియేషన్ ప్రెసిడెంట్ జె.గౌతమ్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# 9 నుండి నన్నయ క్రీడా పోటీలు

04.12.21 (మీడియాసెల్) ఆదికవి నన్నయ యూనివర్సిటీ పరిధిలో ఈ నెల 9వ తేది యోగా మెన్ అండ్ ఉమెన్, క్రికెట్ ఉమెన్ పోటీలు జరుగుతాయని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. విశ్వవిద్యాలయ క్రీడా జట్టుల ఎంపికల సమాచారాన్ని వీసీ విడుదల చేసారు. ఉభయగోదావరి జిల్లాల్లోని అనుబంధ కళాశాలల విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొని తమ ప్రతిభను కనపరచి విశ్వవిద్యాలయ జట్టుకు ఎంపిక కావాలని తెలిపారు. 9వ తేది యోగా మెన్ అండ్ ఉమెన్ పోటీలను యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ నిర్వ హిస్తుందని, క్రికెట్ ఉమెన్ పోటీలను ఇంజనీరింగ్ కాలేజ్ నిర్వహిస్తుందని అన్నారు. 14,15వ తేదీలలోబాస్కెట్ బాల్ ఉమెన్ పోటీలను యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ నిర్వహిస్తుందని చెప్పారు. ఈ పోటీలను స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరి డా.బి.రామ్ గోపాల్, డా.కె.బాలసత్యనారాయణ, వి.ఎస్.దేవానంద్, సిహెచ్.సుబ్రహ్మణ్యం పర్యవేక్షిస్తారన్నారు.




CERTIFICATE

Adikavi Nannaya University (established on April 22, 2006) of Andhra Pradesh, India, set a record for being the fastest to organise 100 webinars. The university organised 100 webinars in 476 days from May 11, 2020 to August 30, 2021, as confirmed on October 23, 2021.

Date: November 06, 2021

## మంచి మాట



దేహానికి దెబ్బ తగిలితే మందు కావాలి. ఆత్మకు తగిలితే మందు సరిపోదు. మనసు కావాలి. అప్పుడే కవిత్వం అవసరమవుతుంది.

– సిరివెన్నెల సీతారామశాస్త్రి

## ప్రతిభా వాణి

# ఘంటసాల శతజయంతి

(4 డిసెంబర్ 1922 - 11 ఫిబ్రవరి 1974 )

ఘంటసాల వెంకటేశ్వరరావు తెలుగు సినిమా సంగీత దర్శకులు, నేపథ్య గాయకులు. ఘంటసాల జన్మతః వచ్చిన గంభీరమైన స్వరంతో పట్రాయని సీతారామశాస్త్రిగారి వద్ద శాస్త్రీయ సంగీత శిక్షణతో తెలుగు సినిమా సంగీతంలో ఒక విభిన్నమైన వ్యక్తిత్వాన్ని సంతరించు కోవడానికి దోహదపడ్డారు. తెలుగు సినిమా నేపథ్యగాయకులలో ఘంటసాల ఒకరు. వ్యాఖ్యానంతో సహా ఆయన ఆలపించిన భగవద్గీత తెలుగు వారిలో అత్యంత ప్రజాదరణ పొందింది. ఒక తరానికి చెందిన కొన్ని వేల సినిమా పాటలు ఆయన ఆలపించినవే. ఆయన గొంతు తెలుగు ప్రజలకు సుపరిచితం. కృష్ణాజిల్లా గుడివాడ సమీపంలో చౌటపల్లిలో పుట్టారు. సూర్యనారాయణ, రత్నమ్మ వారి తల్లిదండ్రులు.

1951లో పాతాళభైరవి విజయంతో ఘంటసాల పేరు ఆంధ్రదేశమంతా మారుమ్రోగింది. అప్పుడే మద్రాసులో ఇల్లు కొనుక్కొని తన కుటుంబాన్ని తీసుకువచ్చారు. తరువాత విడుదలైన మల్లీశ్వరి చిత్రంలోని పాటలు అత్యంత ప్రజాదరణ పొందడానికి సాలూరి రాజేశ్వరరావు సంగీతానికి ఘంటసాల గాత్రం తోడవడమే! 1953లో వచ్చిన దేవదాసు ఘంటసాల సినీజీవితంలో కలికితురాయిగా నిలిచిపోయింది. ఆచిత్రంలో తన నటనకంటే ఘంటసాల గాత్రమే తనకు ఇష్టమని అక్కినేని నాగేశ్వరరావు చెపుతుంటారు. 1955లో విడుదలైన అనార్కలి చిత్రం మరింత గొప్పపేరు తెచ్చింది.



1957లో విడుదలైన మాయాబజార్ సినిమా పాటలు తెలుగు సినీచరిత్రలో అగ్రతాంబూలం అందుకున్నాయి. 1960లో విడుదలైన శ్రీ వెంకటేశ్వర మహాత్యం సినిమాలోని 'శేషశైలావాస శ్రీ వేంకటేశ ' పాటను తెరపైనకూడా ఘంటసాల పాడగా చిత్రీకరించారు. ఎటువంటి పాటైనా ఘంటసాల మాత్రమే పాడగలరనే ఖ్యాతి తెచ్చుకొన్నారు. 1970 వరకు దాదాపు ప్రతిపాట ఘంటసాల పాడినదే! ఏనోట విన్నా అతను పాడిన పాటలే. ఘంటసాల ఎంత గొప్పస్థితికి చేరుకొన్నా తనను ఆదరించిన వారిని మరువలేదు. అతను ఎన్నడూ మరొకరిని నొప్పించేవారుకాదు. కోరినవారికి కాదనక సహాయంచేసేవారు. "నాదు ఏతల్లి మొదటి కబళం నా జోలెలో వేసిందో ఆమె ఆవాత్సల్యపూరితమైన భిక్ష నాకు అష్టైశ్వర్యాలతో కూడిన భవిష్యత్తును ప్రసాదించింది " అని ఎన్నోసార్లు చెప్పేవారు.

మద్రాసులో ఇల్లుకొన్నప్పుడు గురువుగారైన పట్రాయని సీతారామశాస్త్రిగారికి గృహప్రవేశానికి రావడానికై టికెట్టుకొని గృహప్రవేశం రోజు వెయ్యినూటపదహార్లు, పట్టుబట్టలు వెండిపళ్ళెంలో సమర్పించి సాష్టాంగ నమస్కారంచేసి ఆయన పట్ల తన గౌరవాన్ని చాటుకున్నారు. సీతారామశాస్త్రిగారి కూమారుడు పట్రాయని సంగీతరావు ఘంటసాల వద్ద సంగీత స్వర సహచరుడిగా, ఘంటసాల చివరి శ్వాస వరకు తోడుగా,ఆప్తమిత్రుడుగా ఉన్నారు. పానగల్ పార్కులో కష్టాల్లో ఉన్నప్పుడు కూడా తోటివారికి ఆకలిగా ఉన్నప్పుడు భోజనాలు కల్పించేవారు. సంగీతాభ్యాసం చేస్తున్నరోజుల్లో తనను 'అన్నా' అని పిలిచే స్నేహితుడు పాపారావుకు తాను గొప్పవాడినైతే వాడీ కొనిస్తానని చెప్పాడు. కొన్నేళ్ళకు పాపారావు 'అన్నా గొప్పవాడివయ్యావు కదా నా వాచీ ఏదీ' అని ఉత్తరం రాయగా నూరు రూపాయలు పంపించాడు. కానీ అప్పటికే పాపారావు టైఫాయిడ్ వచ్చి మరణించాడు. తరువాత పాపారావు కుమారుడు నరసింగరావును తనఇంట పెంచి తనకుమారుడిగా చూశారు. ఈ ఉదాహరణలు ఆయన వ్యక్తిత్వానికి ప్రతిబింబాలు.

ఘంటసాల తన గానంతో తెలుగు ప్రజల హృదయాల్లో శాశ్వతంగా జీవించే ఉంటారు. శత జయంతి వత్సరం సందర్భంగా నన్నయవాణి వారికి అక్షర నీరాజనాన్ని సమర్పిస్తుంది.

# మన కళాశాలలు



**SRI Y N COLLEGE(A), NARSAPUR**
**Thrice Accreated By NAAC with 'A' Grade**
**Affiliated to Adikavi Nannaya University, Rajamahendravaram**

పవిత్ర గోదావరీ నదీపవనాలు, వటతరుచ్ఛాయ, ప్రాచీన రాజసౌధం వంట డచ్ భవనం, గురుకులవాతావరణం తలపింపజేస్తూ –'తమసోమాజ్యోతిర్గమయ'– అనే ఉపనిషత్ప్రార్థనతో పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం లో 1949 లో ది నర్సాపూర్ కాలేజ్‌పేరిట స్థాపితమై ఇంతింతై.... అన్నట్లు విద్య సుమగంధాన్ని విరజిమ్ముతూ దినదిన ప్రవర్ధమానమౌతూ శ్రీ యర్రమిల్లి నారాయణమూర్తి కళాశాల విద్యాతీర్థక్షేత్రమై, దూరప్రాంత విద్యార్థుల్ని సైతం ఆకర్షిస్తూ ఈనాటికి విశ్వవిద్యాలయ మన దగిన స్థాయిలో ఉంది.

**వ్యవస్థాపక కార్యదర్శి:-**
శ్రీ యర్రమిల్లి నారాయణమూర్తి

**నాడుసహకరించినపెద్దలు:-**
శ్రీ గ్రంథి వేంకటరెడ్డినాయుడు,
శ్రీ అల్లూరి సత్యనారాయణరాజు,
శ్రీ గాదె మాణిక్యం గుప్తా.

**అనంతరకార్యదర్శులు:-**
శ్రీ జవ్వాది లక్ష్మయ్యనాయుడు,
శ్రీ కోసూరిఆదినారాయణ,
శ్రీ చక్రావధానుల రెడ్డప్పధవేజీ,
శ్రీ లక్ష్మీనరసింహ ధవేజీ, డా. M. S. శాస్త్రి.

**1983 నుండి నేటిదనుక క్రాంతదర్శియైన కార్యదర్శి :**
డా.చినమిల్లి సత్యనారాయణరావు.

**లబ్ధప్రతిష్ఠులైనప్రిన్సిపాల్స్:-** శ్రీవంగూరి సుబ్బారావు,
శ్రీ జె. వేంకటేశ్వర్లు,
డా. శ్రీపాద గోపాల కృష్ణమూర్తి,
డా. టేకుమళ్లరామారావు,
శ్రీ కె. సన్యాసయ్య ....

**అనుభవజ్ఞులైన అధ్యాపక-** అధ్యాపకేతర సిబ్బంది, ఎందరో దాతల సహకారం వలన విశ్వవిద్యాలయాలతో పోటీపడే విధంగా రూపు దిద్దుకుంది.

**వివిధ ప్రోగ్రామ్స్:-**
ఇంటర్మీడియట్ మరియు డిగ్రీలో సాంప్రదాయ కోర్సులు B.A., B. Com., B.Sc.,లతో పాటు BBA, BCA, B.VOC., :– ఫ్యాషన్ టెక్నాలజీ, నర్సింగ్, మున్నగు 18 ప్రోగ్రామ్స్....
డా. చినిమిల్లి సత్యనారాయణరావు పోస్ట్ గ్రాడ్యుయేట్ సెంటర్.
M. A. English, M.B.A., M.C.A., M.Sc. Mathematics
M. Sc.Organic Chemistry

2004 నుండి నేటి వరకు వరుసగా మూడుసార్లు (2004, 2010, 2016) NAAC A grade సాధించిన కళాశాల.
2007 లో UGC ద్వార స్వయంప్రతిపత్తి హోదా పొందింది.



**డా.చినమిల్లి సత్యనారాయణరావు**
**సెక్రటరీ అండ్ కరస్పాన్డెంట్,**
**శ్రీ వై.ఎన్.కళాశాల.**





డా.రంగినీడి పార్థసారథి
ప్రిన్సిపాల్,వై.ఎన్.కళాశాల.




డా.ఎన్. చింతారావు
డైరెక్టర్,పి.జి.సెంటర్.


2004 లో నాన్ అటానమస్, నాన్ మైనారిటీ కేటగిరీలలో ఆనాటి సంయుక్త ఆంధ్రప్రదేశ్‌లో NAAC 'A' గ్రేడ్ సాధించిన ప్రథమ కళాశాల శ్రీ వై. యన్. కళాశాల.
రెండుసార్లు వరుసగా UGC Potential for Excellence సాధించిన కళాశాల.

వై.యన్ కళాశాలలో ఉన్న ఇతర కళాశాలలు
డైమండ్ జూబ్లీ జూనియర్ కళాశాల
శ్రీ గ్రంధి వెంకటరెడ్డి నాయుడు బి.ఎడ్ కళాశాల (2007)

**కళాశాల విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధికి సపోర్ట్ సర్వీసెస్ :-** NCC, NSS, కమ్యూనిటీ సర్వీసెస్ సెంటర్, యోగా & హెల్త్ సెంటర్, ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్, గాంధీయన్ స్టడీస్ సెంటర్, ఇన్నోవేషన్& ఎంటర్ ప్రెన్యూర్షిప్ డెవలప్ మెంటు సెంటర్, ఉపాధి నైపుణ్యాలు పెంచుతు జాబ్ మేళాలు నిర్వహిస్తూ ఎంతోమంది విద్యార్థులకు ఉద్యోగాలు కల్పిస్తున్న HRD సెంటర్.

Infrastructure **(మౌలిక సదుపాయాలు) :**
పలు బహుళఅంతస్థులభవనాలు, రెండు గ్రంథాలయములు, రెండు విద్యార్థినుల హాస్టల్స్, ఒక ఆడిటోరియం, ఓపెన్ ఎయిర్ థియేటర్స్, డిజిటల్ & స్మార్ట్ క్లాసురూమ్స్, సెమినార్ హాల్స్, వివిధమైన కంప్యూటర్, ఫిజికల్ సైన్సెస్, బయోలాజికల్ సైన్సెస్ లాబ్స్, బొటానికల్ గార్డెన్, R.O వాటర్ ప్లాంట్, విశాలమైన ఆటస్థలం, జిమ్నాసియం. 2500 పైగా విద్యార్థులతో, సుమారు 135 మంది అధ్యాపక– 50 అధ్యాపకేతర సిబ్బందితో ఆధునిక విద్యనందిస్తూ ..ఒక మినీ యూనివర్సిటీ, ఒక ఆధునిక గురుకులం అనదగినస్థాయిలో సద్విద్యాదానం చేస్తున్న శ్రీ వై.యన్ కళాశాల (నరసాపురం) ఉత్తమపౌరుల్ని దేశానికి అందిస్తుండటం సర్వధా అభినందనీయం.



శ్రీ యెఱ్ఱమిల్లి నారాయణమూర్తి (వై. ఎన్)









---


## దశ వసంతాల తెలుగు శాఖలో..

# సిరివెన్నెల జ్ఞాపకాలు



*2017 మార్చి 9న 'వెయ్యేళ్ళ సాహిత్య సమాలోచనం' పేరు మీదుగా జాతీయ సదస్సు జరిగినప్పుడు నాటి ఉపకులపతి ఆచార్య ముర్రు ముత్యాలు నాయుడుగారి ఆహ్వానంతో ముఖ్యఅతిథిగా సిరివెన్నెల సీతారామశాస్త్రి నన్నయ విశ్వవిద్యాలయానికి విచ్చేశారు. విగ్రహానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. సినిమా ఫంక్షన్ ల కంటే కళాశాలలకు వెళ్లి ప్రసంగించడానికి ఇష్టపడే శాస్త్రిగారు యువత గురించి తప్పుగా మాట్లాడితే ఒప్పుకునే వారు కాదు. వాళ్ళు తెల్లకాగితాలు లాంటి వారని అన్నారు. వారిని తీర్చిదిద్ది సమాజానికి అందించాలని అన్నారు. క్రమశిక్షణతో, శ్రమజీవితాన్ని కలిగి విజయాన్ని సొంతం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు.నాటి సదస్సుకు తెలుగుశాఖ సహాయాచార్య డా.తరపట్ల సత్యనారాయణ సంచాలకులుగా వ్యవహరించారు.*

*2020 నవంబర్ 19న 'ఆచార్య ఆత్రేయ శతజయంతి' సందర్భంగా జాతీయ సదస్సు జరిగినప్పుడు ఆచార్య మొక్కా జగన్నాథరావు గారి ఆధ్వర్యంలో ముఖ్యఅతిథిగా సిరివెన్నెల సీతారామశాస్త్రి పాల్గొని ఆత్రేయ సాహిత్యంపై విశ్లేషణాత్మకంగా ప్రసంగించారు. ఆత్రేయ సాహిత్యంలోని లోతైన భావాల్ని విపులీకరించారు. ఆ సదస్సులో భువనచంద్ర, వెన్నెలకంటి, వెనిగళ్ళ,రసరాజు, గురుచరణ్, పైడిపాల వంటి సినీ రచయితలు పాల్గొన్నారు. సదస్సుకు తెలుగుశాఖ సహాయాచార్య డా.దొంతరాజు లక్ష్మీనరసమ్మ సంచాలకులుగా వ్యవహరించారు.*



*విశ్వవిద్యాలయం నిర్వహించిన మరియు తెలుగుశాఖ నిర్వహించిన వివిధ సదస్సులలో సిరివెన్నెల, గొల్లపూడి మారుతి రావు, ప్రయాగ రామకృష్ణ,వెనిగళ్ల రాంబాబు, సుద్దాల అశోక్ తేజ, గోరటి వెంకన్న,అందెశ్రీ, యండమూరి, తనికెళ్ల భరణి, వంగపండు ప్రసాదరావు,బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు గారు వంటి సాహితీ ప్రముఖులు పాల్గొని విద్యార్థులకు ప్రేరణాత్మక సందేశాల్ని అందించడం ఎంతో సంతోషదాయకం. అధికారుల ప్రోత్సాహంతో మరిన్ని మంచి కార్యక్రమాలకు విశ్వవిద్యాలయం, తెలుగుశాఖ వేదిక కావాలని ఆశిస్తున్నాను.*




– డాక్టర్
కె.వి.ఎన్.డి.వరప్రసాద్
తెలుగు శాఖాధిపతి ఆదికవి
నన్నయ విశ్వవిద్యాలయం



ప్రచురణ : మీడియా సెల్, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం-రాజమహేంద్రవరం, ఈమెయిల్ :- nannayavani@aknu.edu.in